సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 3 । జనవరి । 2023



కేటీఆర్‌ను కలిసిన సెస్ చైర్మన్

సిరిసిల్ల: మంత్రి కేటీఆర్‌ను 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు సోమవారం ప్రగతిభవన్‌లో కలిశారు. డైరెక్టర్ల ఆత్మీయ సత్కారానికి రావాలని మంత్రిని ఆహ్వానించారు.



అనాథలకు పండ్లు పంపిణీ

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులు సోమవారం 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి ఉత్తమ బోధన పురస్కారం



వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్‌కు జాతీయస్థాయి ఉత్తమ బోధన పురస్కారం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. పంజాబ్‌లోని లూథియానాకు చెందిన క్రైట్స్ క్రాఫ్ట్స్ సంస్థ డిసెంబర్ 17న ఈ అవార్డును అందజేసింది. ఈ నేపథ్యంలో కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మధు రాజేశ్, అప్సారీ ఉస్మాని, మల్లారెడ్డి, రమాదేవి, రాజేశ్, ప్రభాకర్, నీలం శ్రీనివాసులు, నారాయణ, నర్సయ్య, కరుణ, మధుబాబు, దీపిక సన్మానించారు.

'హౌస్ అరెస్టులు అప్రజాస్వామికం'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్

వేములవాడ: హౌస్‌అరెస్టులు అప్రజాస్వామికమని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. పంచాయతీల నిధుల మళ్లింపును నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు వెళ్తుండగా ఆది శ్రీనివాస్‌ను పోలీసులు అడ్డుకుని గృహనిర్బంధం చేశారు. గ్రామాల్లో సౌకర్యాల కల్పన, పంచాయతీ సిబ్బంది వేతనాల చెల్లింపులకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. వెంకటస్వామి, వకులాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, సోయినేని కరుణాకర్, కదిరే రాజ్‌కుమార్, బొడ్డు రాములు, చిలివేరి శ్రీనివాస్, ఎడవెల్లి అనిల్ ఉన్నారు.

అదనపు టీఎంసీ పనులకు సహకరించాలి



పరిహారం చెక్కు అందిస్తున్న ఆర్డీవో

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులకు సహకరించాలని వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ కోరారు. రత్నంపేటలో వరదకాల్వ నిర్మాణంలో భూములు కోల్పోతున్న ర్యాగల్ల పోచయ్య, ర్యాగల్ల నారాయణ తదితర రైతులకు సోమవారం పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ పరిహారం పొందిన రైతుల భూముల్లో కాల్వపనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తహసీల్దార్ దర్శెల్లి నరేశ్, ఆర్ఐ రాజశేఖర్, రంగి తిరుపతి, ఈడుగు అంజయ్య ఉన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్లటౌన్: డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రాని పేదలకు ప్రభుత్వమే స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. సిరిసిల్లలో సోమవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రాని బాధితులతో కలిసి ధర్నా చేపట్టారు. బుధవారం మంత్రి కేటీఆర్‌కు పోస్టుకార్డులు రాసే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కోడం రమణ, శ్రీరాం సదానందం, సూరం పద్మ, మోర అజయ్, గోవిందు లక్ష్మణ్, ఎలిగేటి రాజశేఖర్, సామల కవిత పాల్గొన్నారు.

మైనార్టీల ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడరూరల్: మైనార్టీ యువత ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వేములవాడ రూరల్ ఎంపీడీవో రాంరెడ్డి సోమవారం ప్రకటనలో కోరారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ముస్లింలు, సిక్కులు, పార్శీలు, బౌద్ధులు, జైనులలో ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులకు రాయితీపై యూనిట్లు మంజూరు చేయనున్నట్లు వివరించారు. 55 సంవత్సరాల లోపు వయస్సు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలలోపు ఆదాయం, ఆధార్ కార్డు జిరాక్స్, తెల్లరేషన్ కార్డు ప్రతులతో ఈనెల 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం మూడు సెట్ల జిరాక్స్‌లను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు 9494648630లో సంప్రదించాలని కోరారు.

ముక్కోటి వేడుకలు





రాజన్న ఆలయంలో దర్శనానికి బారులుతీరిన భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



సిరిసిల్లలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



దర్శనానికి బారులుతీరిన భక్తులు

వేములవాడ/సిరిసిల్లకల్చరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని జిల్లాలోని వైష్ణవాలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనానికి వచ్చారు. వేములవాడ రాజన్న సన్నిధి, సిరిసిల్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయాల్లో వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజన్నను ఉత్తర ద్వారం గుండా దాదాపు 20 వేల మంది దర్శించుకున్నారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ దర్శించుకున్నారు. అల్లి శంకర్ ప్రసాదాలు అందజేశారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పల్లెలకు పైసలు కరువు

- పన్నులు వసూలు చేసినా ఖజానా ఖాళీ !
- పంచాయతీల్లో పన్నులు వసూలు..
- సర్కార్ ఖాతాల్లోకి సొమ్ము
- ఈ–పంచాయతీలతో జీపీలకు దక్కని ఫీజు
- మూడేళ్లుగా రూ.8.58 కోట్ల బకాయి



ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయం

మండలాల వారీగా రావాల్సిన నిధులు

బోయినపల్లి	రూ.40.36 లక్షలు
చందుర్తి	రూ.24.38 లక్షలు
ఇల్లంతకుంట	రూ.52.44 లక్షలు
గంభీరావుపేట	రూ.85.81 లక్షలు
కోనరావుపేట	రూ.54.46 లక్షలు
ముస్తాబాద్	రూ.1.24 కోట్లు
రుద్రంగి	రూ.35.96లక్షలు
తంగళ్లపల్లి	రూ.1.68 కోట్లు
వీర్నపల్లి	రూ.5.31లక్షలు
వేములవాడ	రూ.49లక్షలు
వేములవాడరూరల్	రూ.28లక్షలు
ఎల్లారెడ్డిపేట	రూ.1.89 కోట్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): పొద్దున లేస్తే చేతిలో రిజిస్టర్, పన్ను రశీద్ పుస్తకాలతో వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నా గ్రామపంచాయతీలకు రూపాయి దక్కడం లేదు. గ్రామపంచాయతీలు అందిస్తున్న సేవలకు జీపీ సిబ్బంది జనం నుంచి క్రమం తప్పకుండా పన్నులు వసూలు చేస్తున్నారు. దాదాపు వంద శాతం లక్ష్యం చేరుకుంటున్నా పన్నుల రూపంలో వస్తున్న సొమ్ము మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలోకి వెళ్లిపోతోంది. చిన్నపాటి అవసరాలు తీరుద్దామంటే పంచాయతీ ఖజానా వెక్కిరిస్తోంది. ఈ–పంచాయతీ వ్యవస్థతో మూడేళ్లుగా జీపీలకు పన్నుల సొమ్ము రావడం లేదు. గత మూడేళ్లలో జిల్లాలోని పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వ ఖాజానా నుంచి రూ.8.58 కోట్లు రావాల్సి ఉంది.

255 జీపీలు.. రూ.8.58 కోట్ల బకాయి

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ–పంచాయతీ(టీఎస్‌బీపాస్) విధానంతో గ్రామాల్లో వసూలు చేస్తున్న సొమ్మును పంచాయతీ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్నారు. ధ్రువీకరణపత్రాలు, భవన నిర్మాణ అనుమతులు, వారసత్వ పేరు మార్పిడి తదితర సేవలకు రుసుం వసూలు చేస్తారు. 2018 ఆగస్టు నుంచి టీఎస్‌బీపాస్ పేరుతో మీ–సేవలోనే దరఖాస్తు చేసుకుని ఫీజులు చెల్లించాలి. ఇందులో నూరుశాతం పారదర్శకత ఉంది. ఇదే సమయంలో గ్రామాల్లో సేవల ఫీజులపై రాష్ట్ర ప్రభుత్వానిదే ఆజామాయిషి. లే అవుట్ల అనుమతి, వ్యవసాయ భూముల రెగ్యులైజేషన్ వంటి లైసెన్స్ ఫీజులతోపాటు ట్రేడింగ్ లైసెన్స్ ఫీజులు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఈ–పంచాయతీ అమలు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండు, మూడుసార్లు నిధులు విడుదలయ్యాయి. గత మూడేళ్లుగా నిధులు విడుదల చేయడం లేదు. కేంద్రం ఫైనాన్స్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ ద్వారా నిధులు విడుదల చేస్తున్నా టీఎస్‌బీపాస్ ద్వారా వసూలైన పన్నుల నిధులు మాత్రం రావడం లేదు. సీనరేజీ, స్టాంప్‌డ్యూటీ, మైనింగ్ వంటి పన్నుల నిధులు పంచాయతీలకు చేరడం లేదు.

నిధుల లేమితో కష్టాలు..

లైసెన్స్, మ్యూటేషన్, నిర్మాణ అనుమతులు, ధ్రువీకరణపత్రాల ఫీజులు రాక పంచాయతీ సిబ్బంది దిక్కులు చూస్తున్నారు. డ్రెయినేజీలు, సీసీరోడ్లు, నీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టలేకపోతున్నారు. పంచాయతీ సిబ్బంది వేతనాలు సకాలంలో చెల్లించడం లేదు.

20 వేల దరఖాస్తులు

- రాజన్నసిరిసిల్ల జిల్లాలో టీఎస్‌బీపాస్ ద్వారా పలు సేవల కోసం 20,064 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- ఇందులో 2,037 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా.. 15,056 దరఖాస్తులు ఆన్‌లైన్ అప్‌లోడ్ చేశారు.
- 2,181 దరఖాస్తులకు అనుమతులు లభించాయి. 291లో ప్రాసెస్‌లో ఉన్నాయి.
- దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో రూ.8.58 కోట్లు ఫీజుల రూపంలో చెల్లించారు. ఈ నిధులనే ఆయా పంచాయతీలకు తిరిగి చెల్లించాల్సి ఉంది. గతంలో పంచాయతీ సిబ్బందే నేరుగా ఎస్‌టీవోలో చెల్లించి, చెక్‌మేజర్ ద్వారా నిధులు తీసుకునే వెసులుబాటు ఉండేది. టీఎస్‌బీపాస్ అమలుతో ఈ అవకాశం లేదు.

అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నాం



పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది కష్టపడి లైసెన్స్, భవన నిర్మాణాలకు సంబంధించిన రుసుం వసూలు చేస్తున్నారు. ఆ నిధులు పంచాయతీ ఖాతాల్లోకి జమచేసుకునే వీలు లేదు. ఈ పంచాయతీ ద్వారా అధికారులకు వెళ్లిపోతోంది. ఆ నిధులు సకాలంలో పంచాయతీలకు జమచేయడం లేదు. అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నాం. – గాండ్ల సుమతి, సర్పంచ్, ముస్తాబాద్

వేతనాలు చెల్లించలేని స్థితి



మేము ఎంతో కష్టపడి పంచాయతీలకు ఆదాయం తీసుకొస్తున్నాం. టీఎస్‌బీపాస్‌తో వచ్చే రుసుం మొత్తం రాష్ట్ర ఖాజానాకే పోతోంది. మూడేళ్లుగా ఆ నిధులు రావడం లేదు. కార్యదర్శులు, సిబ్బంది వేతనాలు కూడా ఇవ్వలేని స్థితి ఉంది.

– రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

చెల్లింపులు చేస్తున్నాం



మూడు నెలల క్రితమే పంచాయతీల ఖాతాల్లోకి నిధులు వెళ్లాయి. చెల్లింపులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. అధికారులకు నివేదిస్తున్నాం. ఈ పంచాయతీతో పారదర్శకత ఉంటుంది. పంచాయతీల రుసుం మొత్తం ఎక్కడికి పోదు. పూర్తిస్థాయి చెల్లింపులు జరుగుతాయి.

– రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సోమవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే.. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా పనిచేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రాంనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి, మండల విద్యాధికారి దూస రఘుపతి, సెక్టోరల్ అధికారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్ శిక్షణ తరగతులు



సూచనలిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట బీసీ స్టడీ సర్కిల్‌లో నిరుద్యోగులకు ఇస్తున్న గ్రూప్–3, 4 శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. దాదాపు 75 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన నిరుద్యోగులు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పిట్ల దాసు, బీసీ శాఖ డైరెక్టర్ వెంకటస్వామి సూచించారు. అధ్యాపకులు కృష్ణమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తుకు 31 వరకు గడువు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో దూస రఘుపతి ఒక ప్రకటనలో అన్నారు. 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హ్యాపీ న్యూ ఇయర్ సర్..



కలెక్టర్ అనురాగ్ జయంతికి శుభాకాంక్షలు చెబుతున్న టీఎన్‌జీవో ప్రతినిధులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సోమవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గాజుల సుదర్శన్, మెట్ట శ్రీకాంత్, ఆకుల శ్రీకాంత్, మహ్మద్ రియాజ్ పాషా, ఇస్తావత్ రాజేశ్వరీ కలిశారు. అంతకుముందు అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, పవన్‌కుమార్, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, డీఈవో రాధాకిషన్, సీపీవో శ్రీనివాసాచారి, డీపీఆర్వో దశరథం, ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్‌రావు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్‌లకు వేర్వేరుగా జిల్లా అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటున్న అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్

పేదలకు ఉచిత న్యాయసేవలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత
- జిల్లా కోర్టులో న్యాయసేవా సంస్థ ప్రారంభం
- వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన హైకోర్టు జడ్జి ఉజ్జల్ భుయాన్

సిరిసిల్లటౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రారంభోత్సవం సిరిసిల్ల కోర్టులో జరగడం శుభపరిణామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో కొత్తగా ఏర్పాటుచేసిన జిల్లా న్యాయాధికార సంస్థ భవనాన్ని హైకోర్టు జడ్జి ఉజ్జల్ భుయాన్ వర్చువల్‌గా హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ అనురాగ్ జయంతితోపాటుగా జిల్లా జడ్జి ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలకు ఉచిత న్యాయసేవలు అందేందుకు జిల్లా ప్రజలకు న్యాయాధికార సంస్థ చేరువైందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ జడ్జీలు శ్రీలేఖ, సత్తు రవీందర్, జూనియర్ సివిల్ జడ్జీలు సౌజన్య, ప్రతీక్ సోహాస్, న్యాయసేవాధికార సంస్థ మెంబర్ చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతం పాల్గొన్నారు.



న్యాయసేవా సంస్థ భవనం ప్రారంభోత్సవంలో జిల్లా జడ్జి ప్రేమలత, కలెక్టర్ అనురాగ్‌జయంతి

'నన్నూ స్కూల్‌కు పంపితే బాగుండు..'

తన ఈడు పిల్లలు ఎంచక్కా యూనిఫామ్, షూలు వేసుకొని స్కూల్‌కు వెళ్తుండగా.. 'నన్నూ స్కూల్‌కు పంపిస్తే బాగుండు..' అనుకుంటున్నట్లుంది ఆ చిన్నారి. బడికి పంపితే తాను కూడా చదువుకున్నే దానిని కదా..! ఇలా స్కూల్‌కు వెళ్లేదానిని కదా..!! అనే రీతిలో ఆ చిన్నారి చూపు కనిపించింది. జిల్లా కేంద్రంలోని పెద్దబజార్ హనుమాన్ ఆలయం వద్ద సోమవారం ఉదయం కనిపించిందీ చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



క్లుప్తంగా

ఎస్పీని కలిసిన అధికారులు



ఎస్పీ రాహుల్‌హెగ్డేతో పోలీస్ అధికారులు

సిరిసిల్లక్రైం: జిల్లాలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న పోలీస్ అధికారులు ఎస్పీ రాహుల్‌హెగ్డేను సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ కేక్ కట్ చేశారు. జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖ అధికారి మామిండ్ల దశరథం, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టీపీవో అన్సారీ, వేములవాడ బార్ అసోసియేషన్ బాధ్యులు ఎస్పీని కలిసి పూల మొక్కలు అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాదివస్‌కు 14 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని, పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజాదివస్‌కు 14 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డే తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడిన ఆయన వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ల అధికారులను ఆదేశించారు. సివిల్ తగాదాల్లో పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

వీర్నపల్లి ఎస్సైగా బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై నవత

వీర్నపల్లి(సిరిసిల్ల): జిల్లాలో షీటీం ఇన్‌చార్జిగా విధులు నిర్వహించిన నవత వీర్నపల్లి ఎస్సైగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన అపూర్వ రెడ్డి సిద్దిపేట కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు. కొత్త ఎస్సై నవత రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. బదిలీపై వెళ్లిన అపూర్వరెడ్డిని సిబ్బంది శాలువాతో సత్కరించారు. రమణారెడ్డి, బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో వ్యక్తి మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గంగుల లింగమూర్తి(51) మతిస్థిమితం సరిగా లేక జీలకుంట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం.. లింగమూర్తికి మతిస్థిమితం సరిగా లేనందున గతనెల 31న ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడటంతో ఓదెల మండలం జీలకుంట, బీమరిపల్లె గ్రామాల మధ్యలో సోమవారం మృతదేహం లభించింది. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాంపల్లి వద్ద గతనెల 30న బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో గాయపడ్డ పనాస కిరణ్‌కుమార్ (34) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై సహదేవ్‌సింగ్ వివరాలు.. కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన కిరణ్‌కుమార్ వ్యవసాయపు పనులు చేసేవాడని పేర్కొన్నారు. మృతుడి తల్లి బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వీధిన పడేస్తున్న పేకాట

"వేములవాడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడ్డాడు. ముందుగా కొంత సొమ్మును ఆటలో పెట్టి ఆడగా ఎక్కువ మొత్తంలో లాభం వచ్చింది. దీంతో ప్రతి రోజూ ఇలాగే వస్తాయని ఆశించిన యువకుడు రమ్మీలో వేలాది రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు పెట్టాడు. చివరికి మొత్తం కోల్పోయి అప్పులపాలయ్యాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసి ఆ యువకుడు రమ్మీ కోసం చేసిన అప్పు తీర్చడానికి ఉన్న పొలం అమ్మివేశారు."

"సిరిసిల్లలోని ఓ చికెన్‌సెంటర్ వెనక ఉన్న గదిలో కొందరు రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం. పది నిమిషాల్లో వేలాది రూపాయలు చేతులు మారడం ఇక్కడ పరిపాటి. డబ్బులు వచ్చిన వాళ్లు ఆనందంతో ఉంటే.. నష్టపోయిన వారు లబోదిబోమంటూ ఇంటికెళ్తుంటారు. పోయిన సొమ్మును ఎలాగైన రాబట్టాలని ఇంటిలో వస్తువులు, మహిళల మెడలో ఉన్న బంగారు నగలు సైతం కుదువపెట్టి మరీ ఆటలో మునిగిపోతున్నారు."



- అడ్డగోలుగా ఆన్‌లైన్ రమ్మీ
- పట్టణాల్లోనూ అడ్డాలు
- ఆర్థికంగా నష్టపోతున్న వైనం
- కుదేలవుతున్న కుటుంబాలు

సిరిసిల్లక్రైం: సైబర్ మోసాలు.. ఆన్‌లైన్ రమ్మీ.. గుట్టచప్పుడు కాకుండా పేకాట.. ఇవన్నీ ఇప్పుడు జిల్లాలోని మధ్యతరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. కూర్చున్న చోటే క్షణాల్లో వేలాది రూపాయలు సంపాదించవచ్చన్న ఆశలతో ఆన్‌లైన్ రమ్మీలో డబ్బులు పెడుతూ నష్టపోయిన సంఘటనలు జిల్లాలో అనేకం ఉన్నాయి. ఇక సైబర్‌మోసాలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఇక పేకాట స్థావరాలు ఇటీవల పెరిగిపోయాయి. సిట్టింగ్‌కు కొంత కమీషన్ చొప్పున గది యజమానికి ఇస్తూ పేకాటస్థావరం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

దుకాణాలు.. శివారు ప్రాంతాలే అడ్డాలు

పేకాటరాయుళ్లు సరదాగా ప్రారంభించే పేకాట నెమ్మదిగా పందేల వరకు వెళ్తోంది. ఒకసారి డబ్బు వచ్చినా.. నష్టపోయిన ఆటలో అడుగు వెనక్కి వేసేందుకు మనసొప్పదని పేకాట ఆడేవారే చెబుతున్నారు. తీన్‌పత్తా, రమ్మీ, అందర్–బహార్ వంటి రకరకాలలుగా ఆడుతున్నారు. రమ్మీ ఆడేందుకు కాస్త సమయం తీసుకుంటే.. తీన్‌పత్తా అయితే పది నిమిషాల్లోనే లక్షల రూపాయలు చేతులు మారుతాయని తెలిసింది. సిరిసిల్లలోని బేకరీలు, చికెన్‌సెంటర్స్, దుకాణసముదాయాలకు సంబంధించిన వెనుక వైపు గదులలో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గదుల యజమానులు పేకాటరాయుళ్లకు తినుబండరాలు, సిగరెట్లు, నీళ్లు, టీలు సైతం సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

జిల్లాలో కేసులు ఇలా..	
2021 గేమింగ్ యాక్టు కేసులు	19
సీజ్ చేసిన నగదు	రూ.1,44,200
2022 గేమింగ్ యాక్టు కేసులు	11
సీజ్ చేసిన నగదు	రూ.2,37,620

ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఆడుతున్న పేకాటరాయుళ్లు మన రాష్ట్రంలో పేకాటకు అధికారిక అనుమతి లేకపోవడం, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో అధికారికంగా ఉండడంతో చాలా మంది అక్కడికి వెళ్లి పేకాట ఆడి వస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల పట్టణ ప్రాంతాల్లోని కొంత ఆర్థికంగా ఉన్న వారు పేకాటలో ప్రావీణ్యం ఉన్న వారిని తీసుకొని వెళ్లి అక్కడ ఆడేందుకు డబ్బులు పెడుతున్నారు. పేకాట ఆడేవారికి నెలకు కొంత సొమ్ము ఇస్తున్నారు. ఇలా రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి శని, ఆదివారాల్లో వందలాది మంది కార్లలో పక్క రాష్ట్రాలకు వెళ్తున్నట్లు తెలిసింది. ఇక్కడ వారం రోజులు కారు నడిపితే రాని జీతం రెండు రోజులు పేకాట ఆడేవారితో వెళ్తే వస్తుందని ఓ కారు డ్రైవర్ తెలిపారు.

నిరంతర నిఘా



గ్రామ శివారు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి అనేక మందిపై కేసు నమోదు చేశాం. చట్టపరిధిలోనే ముందుకెళ్తున్నాం. పేకాట ఆడకుండా ఇంట్లో వాళ్లు కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. సమాజానికి మంచి చేసే ప్రతి పనికి అందరూ బాధ్యతగా సహకరించాలి.

– రాహుల్‌హెగ్డే, ఎస్పీ

సమస్యలు త్వరగా పరిష్కరించండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రజావాణికి 32 దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణికి వచ్చినవారి సమస్యలను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. కలెక్టర్ వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. మొత్తం 32 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం గత నాలుగేళ్లుగా గ్రామ సభ నిర్వహించకుండా, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతోందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చేనేత, జౌళిశాఖ క్లాత్ ఆర్డర్లకు సంబంధించి వివరాలను ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకుంటే సమాచారం ఇవ్వడం లేదని చిమ్మని ప్రకాశ్ ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాఖ్య భవనం ఖాళీ చేయించాలి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న సభ్యులు

రుద్రంగి మండలంలోని పలు గ్రామాల సమాఖ్య మహిళా సంఘాల సభ్యులు సోమవారం ప్రజావాణికి వచ్చి, కలెక్టర్‌ను కలిశారు. 2013లో 8 గ్రామాల సమాఖ్య నిధులతో భవనాన్ని నిర్మించుకున్నామని తెలిపారు. 2016లో నూతన మండల ఏర్పాటులో భాగంగా తమ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి ఇచ్చామన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు అద్దె చెల్లించడం లేదని ఆరోపించారు. అద్దె కోసం పలుమార్లు వెళ్లి అడిగినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలు జరుపుకోవడానికి తాము ఇబ్బంది పడుతున్నామని, సమాఖ్య భవనాన్ని ఖాళీ చేయించి, అద్దె చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఆర్‌అండ్‌ఆర్'లో వసతులు కల్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

తమ సమస్యలు పరిష్కరించాలని ఇల్లంతకుంట మండలంలోని ముంపు గ్రామమైన అనంతగిరి భూ నిర్వాసితులు కోరారు. ముంపునకు గురై మూడేళ్లవుతోందని, కొత్తగా నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, మురుగు కాలువ, అసంపూర్తి రోడ్లు తదితర సమస్యలున్నాయని, పరిష్కరించాలని విన్నవించారు.

'నాలాంటి దివ్యాంగులను ఆదుకోండి'

- ప్రభుత్వ పథకాల్లో అర్హులకు అన్యాయం
- నమిలిగుండుపల్లికి చెందిన దివ్యాంగుడు బండి గంగయ్య ఆవేదన



తహసీల్దార్ ఆఫీస్‌కు వచ్చిన గంగయ్య

వేములవాడరూరల్: ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఎన్నో పథకాలు తీసుకువచ్చినప్పటికీ అర్హులకు అన్యాయం జరుగుతోందని వేములవాడ మండలంలోని నమిలిగుండుపల్లికి చెందిన బండి గంగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కొద్దిపాటి వైకల్యం ఉన్నవారికీ పథకాలు అందుతున్నాయని, పుట్టుకతోనే దివ్యాంగుడినైన తనలాంటి వారు మాత్రం వాహనం కోసం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండటం లేదని వాపోయాడు. సోమవారం అధికారులను కలిసేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. తనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, ఎలాంటి పనీ చేయలేనని తెలిపాడు. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన చెందాడు. తనకు వాహనం కావాలని ఇప్పటికే మూడు సార్లు అధికారులకు దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పటివరకు ఇవ్వలేదని కన్నీరు పెట్టుకున్నాడు. ఇప్పటికైనా తనలాంటి వారిని గుర్తించి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యాప్రమాణాల పెంపునకు సర్కారు కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ అరుణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శంకరయ్య

సిరిసిల్ల: విద్యతో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం కేసీఆర్ నమ్మారని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. సిరిసిల్ల సినారె స్మారక గ్రంథాలయంలో సోమవారం పీఆర్‌టీయూ–2023 కేలండర్‌ను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దుతూ, విద్యాప్రమాణాల పెంపునకు సర్కారు కృషి చేస్తోందన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం జిల్లాకు మెడికల్, నర్సింగ్, వ్యవసాయ, పాలిటెక్నిక్ కాలేజీలను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు

జెడ్పీ చైర్‌పర్సన్ అరుణకు జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డెప్యూటీ సీఈవో, పీఆర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'ధర్మ'ం తప్పిన దర్శనం



రథోత్సవం నాటి టికెట్లనే విక్రయిస్తున్న దృశ్యం



స్వామి దర్శనార్థం క్యూలైన్లలో భక్తులు

- ఆదాయంపైనే అధికారుల ఆసక్తి
- ధర్మ దర్శనాలు ఎత్తివేసిన పాలకవర్గం
- సిరిసిల్లలో ప్రత్యేక దర్శనాల పేరిట దోపిడీ

సిరిసిల్లకల్చరల్: ముక్కోటి ఏకాదశి రోజు సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ అధికారులు, పాలకులు భక్తులకు భారీగా శఠగోపం పెట్టారు. ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చిన భక్తులకు ధర్మదర్శనాలు ఎత్తివేశారని తెలిసి అవాక్కయ్యారు. చేసేదేమీ లేక టికెట్లు కొని స్వామిని దర్శించుకుని వెళ్లారు. ఆదాయంపైనే ఆసక్తి చూపించిన పాలకవర్గంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధర్మ దర్శనాల ఊసే లేదు

వైకుంఠ ఏకాదశి రోజున శ్రీవేంకటేశ్వర ఆలయం పాలకమండలి తీసుకున్న నిర్ణయం భక్తుల ఆగ్రహానికి కారణమైంది. తెల్లవారు జామున తలస్నానం చేసి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ధర్మ దర్శనాలు లేవని చెప్పడంతో తెల్లబోయారు. దర్శనం హడావుడిలో డబ్బులు తెచ్చుకోలేని భక్తులు నిరాశతో వెనుదిరిగిపోయారు. ధర్మదర్శనాలు ఎందుకు రద్దు చేశారని అడిగిన భక్తులకు ఆలయ సిబ్బంది నిర్లక్ష్యంగా జవాబిచ్చారు. అంతేకాకుండా ప్రత్యేక దర్శనానికి రూ.50 టికెట్ నిర్ణయించారు. భార్యభర్తలు, ఇద్దరు పిల్లలతో ఆలయానికి వస్తే దర్శనం టికెట్ల కోసమే రూ.200 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామన్యుల నుంచి టికెట్ల రూపంలో డబ్బులు వసూలు చేసిన సిబ్బంది సంపన్నులు, వ్యాపారులు వస్తే మాత్రం టికెట్లతో సంబంధం లేకుండా నేరుగా దర్శనానికి అనుమతినిచ్చారు.

పాత సంప్రదాయాన్నే పాటించాం



ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల తాకిడిని ముందే ఊహించాం. భక్తుల కోసం పలు ఏర్పాట్లు చేయించాం. దర్శనానికి సంబంధించి గతంలో అనుసరించిన సంప్రదాయాన్నే పాటించాం. భక్తుల దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వలేదు. అందరికీ అవకాశం కల్పించాం.

– మారుతీరావు, ఆలయ ఈవో

సామాన్యులకు దర్శనం లేదా?



పుణ్య తిథి రోజున విష్ణుమూర్తిని సందర్శించుకునే అవకాశం సామన్యులకు కల్పించకపోవడం అన్యాయం. సాధారణ భక్తులకు సైతం టికెట్లు విక్రయించడం దైవాన్ని దూరం చేయడమే. స్పెషల్ దర్శనాలు ఉన్నప్పటికీ ధర్మ దర్శనాలు లేకుండా చేయడం సరికాదు.

– చేపూరి అశోక్, అధ్యక్షుడు, విశ్వహిందూ పరిషత్

ఐకమత్యంతో ఉండాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఐకమత్యంతో ఉంటే ఏదైనా సాధించొచ్చని సెస్ డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని పట్టణ మున్నూరుకాపు సంఘం భవనంలో అధ్యక్షుడు బాధ రమేశ్, మండల అధ్యక్షుడు నంది కిషన్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి నాయకులు ఆయనను సోమవారం సన్మానించారు. అనంతరం మున్నూరు కాపు సంఘాల నూతన కేలండర్ ఆవిష్కరించారు. కృష్ణహరి మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కరిస్తానని పేర్కొన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశం, బీఆర్ఎస్ నాయకులున్నారు.

పశువుల కాపరి దుర్మరణం

తిమ్మాపూర్(మానకొండూర్): మొగిలిపాలెంలో కేజీవీల్స్ ట్రాక్టర్ ఢీకొని పశువుల కాపరి మర్రి నర్సయ్య(71) మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. సోమవారం పాడె కిష్టయ్య కేజీవీల్స్ ట్రాక్టర్‌తో వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన గొర్రెలను మేపుతూ నిలబడిన నర్సయ్యను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సయ్యకు తీవ్రగాయాలు కాగా స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు కేశవులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు.



యథేచ్ఛగా మాంజా విక్రయాలు



సిరిసిల్లకల్చరల్: పతంగులు ఎగరేసేందుకు ఉపయోగించే దారం చైనా మాంజాపై నిషేధం ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్‌లో విరివిగా దొరుకుతోంది. ఈ మాంజా వినియోగం వల్ల పిల్లలు గాయాలపాలవుతున్నారు. ఆదివారం అంబికానగర్‌లోని కుందెన వంశీకి మాంజా కారణంగా లిగమెంట్ తెగిపోయింది. ఇదివరకు పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. కొందరు వ్యాపారులు యథేచ్ఛగా మాంజా విక్రయాలు జరుపుతున్నారు. అధికారుల నిఘా వైఫల్యమే ఇందుకు కారణమన్న ఆరోపణలున్నాయి.

గ్రామ పంచాయతీలుగానే కొనసాగించండి

- విలీన గ్రామాల ఐక్య వేదిక సభ్యులు



మాట్లాడుతున్న ఐక్య వేదిక సభ్యులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలను గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని విలీన గ్రామాల ఐక్య వేదిక సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్‌లో విలీనమైతే అభివృద్ధి చేస్తామని చెప్పిన అధికారులు, నాయకులు ఇప్పుడు తమ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధిహామీ పనులు, డ్రైనేజీ, రోడ్లు, మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నుల భారం మోపుతున్నారని వాపోయారు. ప్రస్తుతం విలీన గ్రామాల భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని మున్సిపల్ శాఖ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ పంపారన్నారు. దీనివల్ల సామాన్య ప్రజలు తమ అవసరాలకు భూమి అమ్ముకోలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఏ ఊరిలోనూ శ్మశానవాటికలు నిర్మించలేదని చెప్పారు. విలీన గ్రామాలను వెంటనే గ్రామ పంచాయతీలుగా కొనసాగించాలని వేడుకున్నారు. ఐక్య వేదిక సభ్యులు బోల్గం నాగరాజుగౌడ్, ఆదిపెల్లి శ్రీనివాస్, సత్యేంద్రి బాలరాజ్, మంగ కిరణ్, గంభీరావుపేట ప్రశాంత్, వంగ అనిల్‌కుమార్, యాదయ్య, బాలకిష్టయ్య తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



ఆంజనేయులు (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని కొండాపూర్‌కు చెందిన పాలోజి ఆంజనేయులు(66) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఆంజనేయులు గత శనివారం తన మనవరాలితో కలిసి దుకాణానికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తుండగా ఆయన చేతిలో ఉన్న వస్తువులను కోతులు లాక్కునే ప్రయత్నం చేశాయి. ప్రతిఘటించడంతో అవి మూకుమ్మడిగా ఆంజనేయులుపైకి వచ్చాయి. ఆయన భయంతో పరుగు తీస్తూ పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయాడు. ఈ ఘటనలో ఆంజనేయులు మెడ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి కుమారులు ధర్మపురి, భాస్కర్, సుదర్శన్, భార్య వీరలక్ష్మమ్మ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.